సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 4 । జూన్ । 2024



నేత్ర పర్వంగా అప్పన్న నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది.

8లో

అష్టదళ పద్మారాధన నేడు

విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళ వారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.




8లో

విరబూసిన బ్రహ్మ కమలాలు

సాక్షి, పాడేరు : స్థానిక ప్రభుత్వ జిల్లా అధికారుల క్వార్టర్స్‌లో డీపీఆర్వో గోవిందరాజులు నివాసం వద్ద బ్రహ్మ కమలాలు విరబూసాయి... ఇవి చూపరులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.





జిల్లాలో పోలింగ్ శాతం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
70.20	7,71,193	5,41,360	2,66,068	2,74,886	8

టెక్..టెక్..టెక్..

నేడే ఓట్ల లెక్కింపు

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ మొదలు
- తొలి ఫలితం అరకులోయ
- అసెంబ్లీ ఫలితాలకు 48 టేబుళ్లతో 65 రౌండ్లు
- అభ్యర్థుల్లో టెన్షన్.. గెలుపోటములపై చర్చోపచర్చలు



కౌంటింగ్ టేబుళ్లు

సాక్షి, పాడేరు : ఉత్కంఠకు తెరపడే సమయం ఆసన్నమైంది. ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైన ఈవీఎంలు పటిష్ఠ భద్రత నడుమ తెరుచుకోనున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల ఫలితాలు కొద్ది గంటల్లో వెలువడనున్నాయి. పాడేరు, అరకులోయ అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలోను కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఓట్లు ఈ రెండు కేంద్రాల్లోనూ లెక్కిస్తారు. కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మే 13వ తేదీన జిల్లా వ్యాప్తంగా 1,021 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మూడు నియోజకవర్గాల పరిధిలో ఈవీఎంల ద్వారా 5,41,360 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం పాడేరు, అరకులోయలలోని ఈవీఎంలను పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు,రంపచోడవరం ఈవీఎంలను రంపచోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి మూడంచెల భద్రతా చర్యలతో పాటు నిరంతరం సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2019 ఫలితాలు రిపీట్ అయ్యే సూచనలే కనిపిస్తున్నా అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఓటర్లు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారా.? అబద్ధాల గుంపువైపు మొగ్గు చూపారా అనేది స్పష్టంకానుంది. సంక్షేమ సారథికే పట్టం కట్టారన్నది ఎగ్జిట్‌పోల్స్ స్పష్టం చేస్తే.. ఎగ్జాట్ పోల్‌లోనూ ఓటరు పల్స్ అదే నిజమని నిరూపించేందుకు మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.



కౌంటింగ్ బ్లాక్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

జిల్లాలో తొలి ఫలితం అరకులోయదే

పోలైన ఓట్ల పరంగా జిల్లాలో తొలి ఫలితం అరకులోయ నియోజకవర్గానిది కానుంది. తరువాత పాడేరు, అనంతరం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. రాత్రి ఏడు గంటల తరువాత పూర్తిస్థాయి ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు మొత్తం 48 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 65 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. జిల్లాలో మొత్తం 10,743 పోస్టల్, సర్వీస్ ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 11 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 12 రౌండ్లలో కౌంటింగ్ చేస్తారు.

మరోసారి ఫ్యాన్ ప్రభంజనమే..

మరోవైపు ప్రీపోల్, ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుపును ఖాయం చేశాయి. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతుందని తేల్చేశాయి. వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. ఉమ్మడి విశాఖలో ఏకంగా 11 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. ఈసారి ఫ్యాన్ గాలి బలంగా వీస్తుందని అభ్యర్థులు దీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ఎగ్జిట్‌పోల్స్ అన్నీ తమకు వ్యతిరేకంగా రావడంతో టీడీపీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహం ఉన్నా.. మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.. ఎన్నికల ముందు ఇచ్చిన తాయిలాలు తమను గట్టెక్కించకపోతాయా అన్న దింపుడు కళ్లెం ఆశతో ఉన్నారు.

అరకు అసెంబ్లీకి 17మంది పోటీ

అరకులోయ అసెంబ్లీ స్థానానికి 17మంది అభ్యర్థులు పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి రేగం మత్స్యలింగం, బీజేపీ నుంచి పాంగి రాజారావు, కాంగ్రెస్ నుంచి శెట్టి గంగాధరస్వామితో పాటు పలు పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరంతా ఫలితాలు కోసం ఉత్కంఠతో ఉన్నారు.

పాడేరు అసెంబ్లీకి 16మంది

పాడేరు అసెంబ్లీకి 16మంది అభ్యర్థులు పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, టీడీపీ,కాంగ్రెస్‌ల నుంచి గిడ్డి ఈశ్వరి,సతక బుల్లిబాబు తదితరులు బరిలో ఉన్నారు.

రంపచోడవరం అసెంబ్లీకి 12మంది

రంపచోడవరం అసెంబ్లీకి వైఎస్సార్‌సీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి,టీడీపీ నుంచి మిరియాల శిరీషాదేవితో పాటు 12మంది పోటీలో ఉన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

కౌంటింగ్ నందర్భంగా పాడేరు, రంపచోడవరం కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.కేంద్ర పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. పాడేరు,రంపచోడవరం పట్టణాల్లో అన్ని చోట్ల పోలీసు బలగాలు బందోబస్తులో నిమగ్నమయ్యాయి.చెక్‌పోస్టులతో పాటు ప్రధాన జంక్షన్‌లలో తనిఖీలు చేపడుతున్నారు. కౌంటింగ్ కేంద్రాల ఆవరణలో బారికేడ్‌లను భారీగా ఏర్పాటు చేశారు.ఇనుప మెస్‌లను తాత్కాలికంగా నిర్మించారు.



పాడేరు కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును సమీక్షిస్తున్న, పాడేరు, చింతపల్లి ఏఎస్పీలు ధీరజ్, శివకిషోర్



అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వివరాలు

అరకులోయ..

మొత్తం పోలైన ఓట్లు :	1,74,588
కౌంటింగ్ టేబుళ్లు :	14
మొత్తం రౌండ్లు :	22
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు :	3,614
కౌంటింగ్ టేబుళ్లు :	3
మొత్తం రౌండ్లు :	4
ఈటీపీబీఎస్ ఓట్లు	53

పాడేరు..

మొత్తం పోలైన ఓట్లు :	1,58,747
కౌంటింగ్ టేబుళ్లు :	14
మొత్తం రౌండ్లు :	23
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు :	2,707
కౌంటింగ్ టేబుళ్లు :	3
మొత్తం రౌండ్లు :	3
ఈటీపీబీఎస్ ఓట్లు :	31

రంపచోడవరం..

మొత్తం పోలైన ఓట్లు :	2,08,025
కౌంటింగ్ టేబుళ్లు :	20
మొత్తం రౌండ్లు :	20
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు :	4,422
కౌంటింగ్ టేబుల్స్ :	5
మొత్తం రౌండ్లు :	5
ఈవీఎంల ఓట్లు :	2,08,025

1999 తరువాత రంపచోడవరంలో మళ్లీ లెక్కింపు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- మోహరించిన పోలీసు బలగాలు



కౌంటింగ్ ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: నియోజకవర్గ కేంద్రం రంపచోడవరంలో 25 సంవత్సరాల తరువాత మళ్లీ ఇప్పుడు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నారు.1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ ఓట్లు లెక్కింపు జరిగింది. తరువాత జరిగిన 2004 ఎన్నికల కౌంటింగ్ రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులో నిర్వహించారు. తరువాత 2009, 2014, 2019 ఎన్నికల కౌంటింగ్ కాకినాడలో నిర్వహించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లా నుంచి తప్పించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేర్చారు. ఏజెన్సీలో ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ అధికారులకు కత్తిమీద సాముగా ఉంటుంది. పోలింగ్ జరిగిన తరువాత ఈవీఎంలను జిల్లా కేంద్రం పాడేరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం చాలా కష్టతరమైన అంశం. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో రంపచోడవరంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో 2,77,317 మంది ఓటర్లు ఉండగా ఈ ఎన్నికల్లో 2,08,025 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.01 శాతం పోలింగ్ నమోదయింది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పోలింగ్‌ను సాయంత్రం 4 గంటలకే ముగించారు. రంపచోడవరంలో నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీకి 20 రౌండ్లు, పార్లమెంట్‌కు 20 రౌండ్లలో ఓట్లు లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

రంపచోడవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఆర్వో ప్రశాంత్‌కుమార్‌లు పరిశీలించారు.అరకు పార్లమెంట్ స్థానం ఓట్లు లెక్కింపును రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, అసెంబ్లీ ఓట్ల లెక్కింపును ఆర్వో ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షిస్తారు. భద్రత ఏర్పాట్లును ఏఎస్పీ జగదీష్ అడహళ్లి పరిశీలించారు. ఎన్నికల లెక్కింపు జరుగుతున్న రంపచోడవరానికి వివిధ మండలాల నుంచి ఎవరు రాకుండా పోలీస్ అధికారులు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఐ పోలవరం జంక్షన్ వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వాహనాల్లో ఎక్కువ మంది ప్రయాణిస్తే వారిని నిలిపివేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో కూడా పోలీసు బలగాలు మోహరించాయి. కౌంటింగ్ కేంద్రం నుంచి రంపచోడవరం సెంటర్ వరకు ఎటువంటి రాకపోకలు జరగకుండా ఆంక్షలు విధించారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత



కౌంటింగ్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత

సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌కు పాడేరు, రంపచోడవరం కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయసునీత తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె పాడేరు డిగ్రీ కళాశాలలోని పాడేరు, అరకులోయ కౌంటింగ్ కేంద్రాలు,స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్‌తో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశామన్నారు.అరకులోయలో 22, పాడేరులో 23,రంపచోడవరంలో 20 రౌండ్లు చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఐటీపీబీ,పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు వేర్వేరు టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు.అన్ని విభాగాలకు సంబంధించి 3వేలకు పైగా సిబ్బంది కౌంటింగ్‌లో పాల్గొంటారని ఆమె తెలిపారు.అనంతరం కౌంటింగ్ అధికారులు,సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ విధులను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో పాడేరు,అరకులోయ ఆర్‌వోలు భావన వశిష్ట,అభిషేక్,డీఆర్‌వో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌ల వారీగా ఫలితాలు

- జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు వివేకానందన్

సాక్షి,పాడేరు: రౌండ్‌ల వారీగా ఎన్నికల ఫలితాలను సకాలంలో మీడియాకు అందించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.వివేకానందన్ ఆదేశించారు.పాడేరు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను సోమవారం ఆయన పరిశీలించి ఇక్కడ ఏర్పాట్లను సమీక్షించారు.ఇక్కడ ఏర్పాటు చేసిన కంప్యూటర్లు,టీవీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీపీఆర్‌వో గోవిందరాజు,డివిజనల్ పీఆర్‌వో రాములు పాల్గొన్నారు.



మీడియా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు వివేకానందన్

పలు రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం(విశాఖ): వివిధ స్టేషన్‌ల నుంచి రావలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున, వివిధ నిర్వహణ కారణాల వలన పలు రైళ్లు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైళ్లు బయల్దేరిన సమయాన్ని బట్టి అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు చేరుకోనున్నాయి. ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

సోమవారం రాత్రి 7.10గంటలకు విశాఖలో బయల్దేరవలసిన విశాఖప -తిరుపతి (08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా రాత్రి 10.10గంటలకు బయల్దేరింది. సోమవారం సాయంత్రం 4.15గంటలకు బయల్దేరవలసిన హౌరా - కాన్యకుమారి (12665) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా రాత్రి 6.30గంటలకు బయల్దేరింది. సోమవారం మధ్యాహ్నం 3.25గంటలకు బయల్దేరవలసిన షాలిమర్ - చెన్నై (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 4.55గంటలకు బయల్దేరింది. సోమవారం మధ్యాహ్నం 3.50గంటలకు బయల్దేరవలసిన బెంగళూరు -విశాఖ (08544) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.45గంటలకు బయల్దేరింది.సోమవారం సాయంత్రం 5.25గంటలకు బయల్దేరవలసిన కన్యాకుమారి - డిబ్రూఘడ్ (22503) వివేక్ సూపర్ ఫాస్ట ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 7గంటలకు బయల్దేరింది.సోమవారం సాయంత్రం 6గంటలకు బయల్దేరవలసిన సంత్రగచ్చి- తాంబరం (22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 18గంటలు ఆలస్యంగా మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు బయల్దేరుతుంది.

మంగళవారం తెల్లవారు 3.55 గంటలకు బయల్దేరవలసిన సికింద్రాబాద్ - షాలిమర్ (12774) ఏసీ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా ఉదయం 6.55గంటలకు బయల్దేరుతుంది. బుధవారం ఉదయం 4.20గంటలకు విశాఖలో బయల్దేరలసిన విశాఖ - బెనారస్ (18311) వీక్లీ ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా ఉదయం 7.05గంటలకు బయల్దేరుతుంది.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం



పొలంలో చేరిన వర్షం నీరు

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. 52.8 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఏఎస్‌వో చైతన్య తెలిపారు. రాజవొమ్మంగి పరిసరాల్లో పెద్ద పెట్టున ఉరుములు మెరుపులు,ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పల్లపు ప్రాంతాలు, పొలాలు జలమయమయ్యాయి. కొండకాలువలు ఉధృతంగా ప్రవహించాయి. రాజవొమ్మంగి శివారు అటవీప్రాంతంలోని కబర్మతి, పులిగుమ్మ కాలువలు పొంగి ప్రవహించడంతో రాజవొమ్మంగి నుంచి రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, పొలాల్లో ఉన్న వారు ఇళ్లకు చేరేందుకు ఇబ్బంది పడ్డారు. ఒక గంట తరువాత కాలువలో ప్రవాహ ఉధృతి తగ్గింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తాజంగి రిజర్వాయర్‌లో గిరిజనుడు గల్లంతు

చింతపల్లిరూరల్: మండలంలోని తాజంగి రిజర్వాయర్‌లో ఓ గిరిజనుడు గల్లంతయ్యాడు. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తాజంగి పంచాయతీ సిరగంపుట్టు వీధికి చెందిన బురిడి గురుమూర్తి దూరపు బంధువు సోమవారం మృతి చెందాడు. అతని అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు గురుమూర్తితో పాటు మరో ఇద్దరు రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. ఆ ఇద్దరూ కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లగా, గురుమూర్తి రిజర్వాయర్‌లో దిగాడు. ఎంతకూ ఒడ్డుకు రాకపోవడాన్ని గమనించిన స్థానికులు, గురుమూర్తి కుటుంబ సభ్యులు గాలింపు ప్రారంభించారు. ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులకు సమాచా రం అందజేశారు.

సీయూఈపీజీ సెట్‌లో గిరిజన విద్యార్థికి 13వ ర్యాంక్



గల్లెల పద్మనాభం

ముంచంగిపుట్టు: కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్(సీయూఈ) పీజీ సెట్‌లో గిరిజన విద్యార్థి ప్రతిభ చూపాడు. ముంచంగిపుట్టు మండలం కర్రిముఖిపుట్టు పంచాయతీ తాంగుల గ్రామానికి చెందిన గల్లెల పద్మనాభం అనే డిగ్రీ విద్యార్థి పీజీ (జువాలజీ)లో చేరేందుకు గత నెల 13న సీయూఈసెట్ రాశాడు.సోమవారం వచ్చిన ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 13వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో 93వ ర్యాంకును సాధించాడు. పద్మనాభం ర్యాంకు సాధించడం పట్ల ఆయన తల్లిదండ్రులు గల్లెల సోమనాథ్,తులసమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

కన్నకొడుకే కాలయముడు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని...
తల్లిని హత్య చేసి పరార్



ఆదమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గంగవరం: జన్మనిచ్చిన పాపానికి ఓ తల్లిపాలిట కన్నకొడుకే కాలయముడిగా మారాడు. మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదన్న కోపంతో కన్నతల్లి అని కూడా చూడకుండా గోడకు తలను కొట్టి హతమార్చాడు. ఈ హృదయ విదారకర సంఘటన మండలంలోని నూగుమామిడిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలు... కొలుతూరి అబ్బాయి, ఆదమ్మ(54) భార్యాభర్తలు. వీరికి వివాహాలైన ఇద్దరు కొడుకులున్నారు.పెద్ద కొడుకు బాలయ్య భార్యతో కలిసి అదే గ్రామంలో నివాసముంటున్నాడు. చిన్నకొడుకు కృష్ణను భార్య విడిచి వెళ్లిపోవడంతో గ్రామంలోనే తల్లిదండ్రులతో ఉంటున్నాడు. నిత్యం తాగుతూ తిరగడమే పనిగా పెట్టుకున్నాడు. రోజూలాగే తాగేందుకు ఆదివారం రాత్రి కూడా తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోడంతో గొడవపడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో తల్లి తలను గోడకు కొట్టాడు. గొడవ జరగడంతో కొడుకు తనను కూడా కొడతాడేమోనని భయపడి తండ్రి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన తల్లి ఆదమ్మ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. తల్లిని హత్య చేసి కృష్ణ పరారయ్యాడని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. అడ్డతీగల సీఐ రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారని, ఆయన ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్బీ హెచ్‌సీ రాజారావు వివరాలు సేకరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


పెదబయలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాంగుల సతీష్‌కుమార్


బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో రోడ్డుపై పడిన వాహనచోదకులు

పెదబయలు: అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ గేదెలబంద గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పెదబయలు మండలానికి వస్తూ బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరోకరు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు అందించిన వివరాల ప్రకరం దుంబ్రిగుడ మండలం గేదెలబంద గ్రామానికి చెందిన తాంగులు సతీష్‌కుమార్, తాంగుల సునీల్ బైక్‌పై వస్తుండగా ఒడిశా సరిహద్దు సూడుబు గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో తాంగులు సతీష్‌కుమార్(17) తల, ఇతరత్రా శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి తాంగుల సునీల్ తల భాగానికి గాయాలతో పాటు కాలు విరిగింది. దీంతో స్థానికులు హుటాహుటిన వారిని పెదబయలు పీహెచ్‌సీకి ప్రైవేట్ వాహనంలో తీసుకొచ్చారు. ప్రాథమిక చికిత్స అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గ మధ్యలో సతీష్‌కుమార్ మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఒడిశా పాడువ పోలీసులకు స్థానిక వైద్యాధికారి నిఖిల్ సమాచారం అందించగా, కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులతో మాట్లాడి పీహెచ్‌సీ నుంచి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లినట్టు వైద్యాధికారి నిఖిల్ చెప్పారు.అతివేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల దోదనలు అందర్ని కలిసివేశాయి


గంగవరంలోని రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వంశీ

కారు ఢీకొని వ్యక్తి మృతి

గంగవరం : జియ్యంపాలెం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవీపట్నం మండలం భీంపల్లి గ్రామానికి చెందిన పి.వంశీకృష్ణ (22) అనే యువకుడు మృతి చెందినట్టు గంగవరం ఎస్‌ఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. దేవీపట్నం మండలం భీంపల్లి గ్రామానికి చెందిన వంశీకృష్ణ రాజుపాలెం గ్రామంలో ఓ శుభకార్య క్రమానికి హాజరై బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఓజుబంద వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఆయన ఢీకొంది. ప్రమాదంలో వంశీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు.తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రంపచోడవరంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

కానిస్టేబుల్ రమేష్ హత్య కేసులో

నిందితుడి ఆత్మహత్య

- మరో నిందితురాలు శివజ్యోతితో రాజయ్యపేటలో సహజీవనం
- ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వివాదం
- మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన రామారావు

పెందుర్తి: నగరంలో గతేడాది సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ బర్రి రమేష్ హత్య కేసులో నిందితుడు సియాద్రి రామారావు (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే హత్య కేసులో ప్రధాన నిందితురాలైన కానిస్టేబుల్ రమేష్ భార్య శివజ్యోతి అలియాస్ శివానీతో వివాదం కారణంగానే రామారావు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి పెందుర్తి మండలం రాజయ్యపేటలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి..నగరంలోని ఎంవీపీ ప్రాంతంలో నివాసం ఉంటున్న బర్రి రమేష్‌ను అతని భార్య శివానీ, ఆమె ప్రియుడు సియాద్రి రామారావు కలిసి గతేడాది ఆగస్టు 3న పథకం ప్రకారం హత్య చేశారు. దీనిపై ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేయగా కొన్నాళ్ల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. మూడు నెలల క్రితం పెందుర్తి మండలం రాజయ్యపేటలో ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరికీ మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రామారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఈ ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్య చేసుకున్న రామారావు (ఫైల్)

పీఎంపాలెంలో 278 మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ రామకృష్ణ, పోలీసులు

మధురవాడ: పీఎంపాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని బక్కన్నపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం(బీ2) కాలనీలో 278 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎంపాలెం నుంచి శంభువానిపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న బీ2 కాలనీలో సోమవానం సాయంత్రం బుడుమూరి ప్రసాద్ అనే బెల్టుషాపు నిర్వాహకుడు వద్ద మద్యం ఉన్నట్టు వచ్చిన సమాచారంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన ఇంట్లో నిల్వ చేసిన 278 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు రామకృష్ణ తెలిపారు.

ఓపెన్ పరీక్షలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: సార్వత్రిక విద్య విధానంలో జరిగే (ఓపెన్) టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయ భాస్కర్ అన్నారు. సోమవారం భీమునిపట్నం, ఆనందపురం మండలాల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు ఎలా జరుగుతున్నాయనేది పరిశీలించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓపెన్ పరీక్షలంటే చూచిరాతలనే ప్రచారం ఉందని, అలాంటి వాటికి తావివ్వకుండా చూడాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లపై ఉందన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

డాబాగార్డెన్స్: నగరంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు నేలమట్టమైంది. ఆ ఇల్లు ఖాళీగా ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాలిలా ఉన్నాయి. పాత నగరం గొల్లవీధి మసీదు జంక్షన్ సమీపాన డోరు నంబరు 20–100–5 గల ఇల్లు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలింది. ఇదిలా వుండగా ఇంటి యజమాని కాశి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. ఇల్లు కూలిందని సమాచారం ఇచ్చినా రాలేదని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి ఇల్లు కూలిన నేపథ్యంలో ఇంటికి సంబంధించిన విద్యుత్ వైర్లు నడిరోడ్డుపై వేలాడాయి. ఇటు విద్యుత్ సిబ్బందికి..పోలీసులకు..జీవీఎంసీ దృష్టికి తీసుకెళ్లినా ఉదయం 10 గంటల వరకు ఎవరూ స్పందించలేదని స్థానికులు వాపోయారు.


గొల్లవీధిలో కూలిపోయిన ఇల్లు

ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు నక్కపల్లి విద్యార్థి

నక్కపల్లి: స్థానిక బీఎస్ హాకీ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థి బెంగళూరులో ఆర్మీ ఎంఈజీ బాయ్స్ స్పోర్ట్స్ స్కూలుకు ఎంపికయ్యాడు. నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొల్నాటి వెంకటేష్ ఈ ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8వరకు బెంగళూరు కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగిన ఎడ్యుకేషన్ ఆఫ్ యంగ్ ఆర్మీ బాయ్స్ సెలక్షన్స్‌లో ఆర్మీ బాయ్స్ హాస్టల్‌కు ఎంపికయ్యాడని బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్ష , కార్యదర్శులు సూరిబాబు, కె.తాతాజీ తెలిపారు. ఈ విద్యార్థికి ఆర్మీ బాయ్స్ హాస్టల్‌లో ఉచితంగా చదువుతో పాటు వసతి ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. హాకీలో అత్యంత ప్రతిభ కనపరచి సెలక్షన్స్‌లో ఎంపికైన వెంకటేష్‌ను పలువురు ఉపాధ్యాయులు, హాకీ ప్రతినిధులు అభినందించారు.

నేత్ర పర్వంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణదారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఏయూకు సెలవు



ఏయూక్యాంపస్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సెలవు ప్రకటించారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఈవీఎంలను ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోనే భద్రపరిచారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా వర్సిటీలో పూర్తిస్థాయిలో పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వర్సిటీ అధికారులు ముందు జాగ్రత్తగా ఏయూకు సెలవు ప్రకటించారు.

చిననందిపల్లి దేవస్థానం భూముల కౌలు వేలం వాయిదా

దేవరాపల్లి: మండలంలోని చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థాన భూముల కౌలుకు సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు నిర్వహించిన వేలంపాట వాయిదా పడింది. అనకాపల్లి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీధర్, వడ్డాది దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీఎస్ఎస్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం వేలం పాట నిర్వహించారు. చిననందిపల్లి సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలు, సర్వే నెంబర్ 112లో 5.03 ఎకరాలు పంట భూములకు మూడేళ్ల కౌలుకు గాను ఈ వేలం పాట నిర్వహించారు. సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలకు ప్రారంభ పాటగా ఎండోమెంట్ అధికారులు రూ. 45వేలు, సర్వే నంబర్ 112లో 5.03 ఎకరాలకు రూ.55 వేలుగా ధరావతు నిర్ణయించారు. ప్రస్తుతం వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని ఇంత భారీ మొత్తంలో వేలం పాట పాడేందుకు ధరావత్తు చెల్లించేందుకు రైతులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో బహిరంగ వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికార్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోతల రఘు వెంకట ప్రసాద్, బి.కృష్ణ, మతల అరినాయుడు పాల్గొన్నారు.


చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

గ్యాస్ సిలిండర్ల వ్యాన్ బోల్తా


బొంతువలస సమీపంలో బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల వ్యాన్

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల – చాపరాతిపాలెం రహదారి మధ్యలో సోమవారం పెనుప్రమాదం తప్పింది. గూడెంకొత్తవీధి నుంచి కొయ్యూరుకు గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న వ్యాన్ బొంతువలస దాటిన తరువాత అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వ్యాన్‌లో ఉన్న కొన్ని గ్యాస్ బండలు కిందకు పడిపోయాయి. అయితే అక్కడ రాళ్లు లేకపోవడం, అంతా మట్టి ఉండడంతో సిలిండర్లకు నష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు. ప్రమాద సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. బోల్తా పడిన గ్యాస్ సిలిండర్లను వారు సరిచేశారు. గతంలో రంపుల, కృష్ణదేవిపేట మీదుగా గ్యాస్ తీసుకువచ్చేవారు.అయితే బూదరాళ్ల రహదారి తక్కువ దూరం కావడంతో అనేక వాహనాల రాకపోకలు ఈ దారిలో సాగిస్తున్నారు. చాపరాతిపాలెం రహదారి జంక్షన్ నుంచి బొంతువలస దాటిన రెండు కిలోమీటర్ల వరకు రహదారి మలుపులతో బాగా డౌన్‌గా ఉంటుంది. ఈ నేపథ్యంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

బురదలో నిలిచిపోయిన బస్సు


బురదలో కూరుకుపోయి నిలిచిపోయిన బస్సు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని హైవేపై సోమవారం ఏలేశ్వరం నుంచి నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో కూరుకుపోయి నిలచిపోయింది. దీంతో ఆ మార్గంలో దాదాపు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మండలకేంద్రం మీదుగా ఎన్‌హెచ్ 516ఈ. విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రోడ్డుపై ఇటీవల గ్రావెల్ పరిచారు. కాగా గత రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్‌పై నీరు నిలిచి రహదారి బురద బురదగా మారింది. నిర్మాణ కార్మికులు యంత్రాల సహాయంతో బస్ ముందుకు కదిలేలా చర్యలు చేపట్టారు. రాకపోకలను పునరుద్ధరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకొన్నారు. కాగా పట్టణ నడిబొడ్డున జరుగుతున్న హైవే నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

మద్దిలపాలెం : పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అలసత్వం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో సోమవారం తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా ఇసుకతోట, విద్యుత్ నగర్, రంగిరీజు వీధి, గాంధీవీధి, చినవాల్తేరు పట్టణఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల సేవలపై ఆరా తీశారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలందించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆరోగ్య సిబ్బంది ద్వారా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందించేలా చూడాలన్నారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. అవసరమైన మందులున్నాయా లేదా అనేది పరిశీలించారు. గర్భిణులు సిజేరియన్ కాకుండా సాధారణ ప్రసవలు జరిగేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వోతోపాటు డాక్టర్.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి శశిభూషన్, డీపీవో నాగభూషణ్, ఎంపీహెచ్‌ఈవో తదితరులు పాల్గొన్నారు.


విశాఖ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులతో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మేలు


ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల రాజీకి మధ్యవర్తిత్వాన్ని అవలంబించడం అవసరమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. సోమవార జిల్లా కోర్ట్ ఆవరణలో నూతన భవన సముదాయంలోని న్యాయమూర్తుల సమావేశ మందిరంలో జరిగిన మీడియేషన్ అండ్ కన్సీలేషన్ శిక్షణా శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల ప్రాథమిక దశలోనే మధ్యవర్తిత్వ విధానాన్ని అవలంబిస్తే 90 శాతం వరకు పెండింగ్ కేసుల పరిష్కారమయ్యే అవకాశం ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. మీడియేషన్ జాతీయ శిక్షకులు న్యూఢిల్లీ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి నిషా సక్సేనా మాట్లాడుతూ సత్వర న్యాయం అందించే దిశగా న్యాయస్థానాలు రాజీ మార్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమయం, ఖర్చులతో పాటు శాశ్వత పరిష్కారం అందించే మధ్యవర్తిత్వ విధానం కక్షిదారులకు, న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. న్యూఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ అదితి అగర్వాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రాథమిక స్థాయిలోనే కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే న్యాయస్థానాల్లో భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాల నుంచి 29 మంది న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరం ఐదు రోజులపాటు కానసాగుతుంది.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

గాలివానకు తెగిపడిన విద్యుత్ వైర్లు

- శరవేగంగా మరమ్మతు పనులు

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయితీల్లో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షం , భారీ ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. మండలంలోని లక్ష్మీపురం, మాకవరం, పెదగూడ, బరడ, వనుగుమ్మ, దొడ్డిపుట్టు, సుజనకోట పంచాయతీల్లో విద్యుత్ వైర్లు తెగిపడగా, స్తంభాలు నేలకోరిగాయి.రాత్రి నుంచి విద్యుత్ లేక గిరిజన గ్రామాలు అంధకారంలోకి వెళ్లాయి.దీంతో స్పందించిన విద్యుత్ సిబ్బంది సోమవారం తెల్లవారుజాము నుంచి విద్యుత్ పునరుద్ధీకరణ పనులను యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టారు.విద్యుత్ వైర్లపై పడిన చెట్ల కొమ్మలు తొలగించి, విద్యుత్ స్తంభాలను సరిచేసి, మధ్యాహ్నంలోగా గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరాను అందించారు. విద్యుత్ అధికారులు స్పందించిన తీరుపై విద్యుత్ వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.


తెగిన విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

దిశ దివ్యాంగ్ సురక్షకు 9 ఫిర్యాదులు


ఫిర్యాదు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రానికి 9 మంది ఫిర్యాదులు చేశారు. దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫోన్, వీడియో కాల్స్ చేసి బాధితులు తమ సమస్యలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు విన్నవించుకున్నారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలిని అందుబాటులో ఉంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ఇతర రాష్ట్రాల నుంచి రెండు, ఇతర జిల్లాల నుంచి మూడు, విశాఖ నుంచి నాలుగు కాల్స్ వచ్చాయి. ఈ ఫిర్యాదులను వెంటనే సంబంధిత రాష్ట్రాల, జిల్లాల అధికారులకు రాతపూర్వకంగా పోస్టల్, వాట్సాప్ ద్వారా పంపించి, అవి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నెల 15వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీకి 4 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ విన్నర్ విశాఖ జోన్

తగరపువలస: ఈ నెల 6,7,8వ తేదీల్లో విజయవాడలో జరగనున్న జూనియర్ బాయ్స్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ పోటీలకు విశాఖ జోన్ జట్టు విన్నర్స్‌గా నిలిచింది. సోమవారం కొమ్మాది విజ్డమ్ గ్రౌండ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో అనకాపల్లి, విశాఖ జోన్ జట్లు పాల్గొన్నాయి. వీటితో బెస్ట్ ఆఫ్ త్రీ ఆడించగా విశాఖ జోన్ జట్టు విన్నర్‌గా గెలిచి విజయవాడలో జరుగు ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌కు వెళ్లనుంది. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ ఎస్.జె.రామకృష్ణ, కోచ్ శేషుమోహన్, వీడీఎఫ్ఏ కార్యదర్శి అక్కరమాని చినబాబు, రాజారావు, మాని తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ విన్నర్‌గా నిలిచిన విశాఖ జోన్ జట్టు